విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 06, సెప్టెంబర్ 2025

సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుంటాం

ప్రజా ప్రతినిధులపై ఉద్యమం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : మండలంలోని ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ప్రజల సమస్యలను పరిష్కరించమంటే కక్షసాధింపు ధోరణి అవలంబిస్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం చేస్తూన్న సర్పంచ్లు, కార్యదర్శులు మళ్ళీ సర్వసభ్య సమావేశాల్లో గొప్ప గొప్ప మాటలు చెబుతున్నారని అభివృద్ధి ఆటంకంగా ఉన్నఅధికారులు, పాలకులపై ఉద్యమం తప్పదని నేడు జరగబోయే సర్వసభ్య సమావేశాన్ని సీపీఐ పార్టీ అడ్డుకుంటుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు,మండల కార్యదర్శి శ్రీనులు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రం లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు చెబుతున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి పనులు జరగడం లేదని ఎమ్మెల్యే సిసి రోడ్లకి నిధులను విడుదల చేశామని చెప్పారని అయితే ఆ నిధులు ఖర్చు చేయకుండా సర్పంచులు అడ్డుకుంటున్నారని, కనీసం గ్రామ సభ తీర్మానం చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ప్రశ్నించారు. భాస్కరాపురం గ్రామంలో బురదమయంతో రోడ్లు ఉన్నాయని రోడ్లు వేయమని సర్పంచ్ కార్యదర్శులను అనేకసార్లు మొర పెట్టుకున్న మాటలతో కాలయాపన చేస్తున్నారని ఆయన తెలిపారు. అనేక ఆందోళనలతో సుపరీపాలనలో ప్రజలు విన్నవించుకుంటే ఎమ్మెల్యే నిధులు విడుదల చేసామని చెప్పారని అయితే సర్పంచ్, గ్రామ సభ తీర్మానం ఎందుకు చేయడం లేదని వారు ప్రశ్నించారు. సిద్దేశ్వరం, చాబోలు, 80బన్నూర్, తరిగోపుల, రామసముద్రం గ్రామాల్లో కనీసం ఇంతవరకు సిసి రోడ్లు లేవని పేద ప్రజలపై ఎందుకు ఇంత కక్ష్య సాధింపు ధోరణి చేస్తున్నారని వారు విమర్శించారు. 80 బన్నూరు గ్రామంలో దాదాపు 50 కుటుంబాల గిరిజనులకు ఇల్లు లేక వీధుల్లో నిద్రిస్తున్నారని దళిత గిరిజనుల అభివృద్ధి పట్ల మొద్దు నిద్ర విడాన్నారు.చాబోలు గ్రామంలో బ్లాస్టింగ్ వల్ల ఇల్లు దెబ్బతిని వర్షంలో జీవిస్తున్న పరిస్థితులు అధికారులకు కనపడదా అని వారు అన్నారు. పారుమంచాల గ్రామంలో స్మశాన వాటికలేక 200కుటుంబాలు 10సెంట్లు లోపలనే ఖననం చేస్తున్నారని ఇది ఎంత వరకు న్యాయమని వారు వారన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య సర్వసభ్య సమావేశానికి హాజరై ఈ సమస్యలపై చర్చించి సమస్యలను పరిష్కరించాలని వారు అన్నారు. తహసీల్దార్, ఎంపీడీవోలు మాటలకే పరిమితమై ఎన్ని సమస్యలు విన్నవించిన పరిష్కారానికి నోచుకోలేదు అన్నారు. పిజిఆర్ ఎస్లో ఫిర్యాదు చేసిన ఫోటోల పరిస్కారంతో కాలయాపన చేస్తున్నారని వారన్నారు. తరీగోపుల నుండి రామసముద్రం వరకు రోడ్డు వేయాలని మండ్లిమ్, భాస్కరపురం రోడ్డు దెబ్బతినిందని, సుగాలి తండాకి రోడ్డు వేయాలని, తుడిచేర్ల గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వర్షం వస్తే మురికిమయంతో మారిపోతుందని కేసి కెనాల్ నీళ్లకి మార్గం చూపడం లేదన్నారు. తరీగోపులలోని ఎస్సీ కాలనీలలో రోడ్లు బురదమయంతో మారాయని వర్షాలు వస్తే ఇళ్ల నుంచి బయటికి రావాలంటే భయంతో అల్లాడిపోతున్నారని ఒకసారి అధికారులు పర్యవేక్షణ చేయాలి వారు అన్నారు. బన్నూరు నుండి చాబోలు వరకు రోడ్డు వేయకుండా ఉండటం వల్ల వాహనదారులు ప్రమాదాలకు లోనై హాస్పిటల్ బరిన పడ్డారన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో అనేక సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించేంతవరకు సర్వ సభ్య సమావేశాన్ని జరగనివ్వమని అవసరమైతే అడ్డుకుంటామని ఆ సమస్యల పరిష్కారంలో రాజీ పడేది లేదన్నారు.ఈ సమస్యలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మక్బూల్ బాషా, శ్రీను, నరసింహ, చెంచన్న, సలీమ్, పుల్లన్న, దేవదానం,తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి : ఫరూక్

ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి గురు పూజోత్సవం వేడుకలు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా డీఈవో జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ముఖ్య అతిథులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 48 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియాలు సత్కరించి, జ్ఞాపికా ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డిప్యూటీ డిఈఓలు, మండల విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బీసీ ఆశీస్సులతో ..
సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

నూతన చైర్మన్‌గా వివేక్ ప్రమాణ స్వీకారం

తరలివచ్చిన మండల టీడీపీ నాయకులు, రైతులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా చింతలాయపల్లి గ్రామానికి చెందిన టీడీపీ యువనేత అంబటి వివేకానంద రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్ నందు నిర్వహించిన చైర్మన్, పాలక వర్గాల ప్రమాణ స్వీకరోత్సవానికి ఆయా గ్రామాల టిడిపి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు రైతులు భారీగా తరలివచ్చారు. నూతన చైర్మన్ అంబటి వివేకానంద రెడ్డి, డైరెక్టర్లుగా కొప్పుల వెంకట శివారెడ్డి, పోతిరెడ్డి సత్యనారాయణ రెడ్డిలను సొసైటీ సబ్ డివిజనల్ అధికారి ప్రభాకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన చైర్మన్ వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర రహదారులు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహాయ సహకారాలతో సొసైటీ అభివృద్ధితోపాటు రైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. తన మీద నమ్మకంతో చిన్న వయసులోనే పెద్ద బాధ్యతను అప్పగించారన్నారు. పెద్దలందరి సూచనలు సహకారంతో సొసైటీని అభివృద్ధి చేస్తామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నదని వాటిని సొసైటీ పరిధిలోని రైతులకు అందేలా చూస్తామన్నారు. కొలిమిగుండ్ల సొసైటీ పరిధిలో చాలా గ్రామాలు ఉన్నాయని తెలిపారు. నూతన చైర్మన్‌కు ఆయా గ్రామాల టిడిపి నాయకులు పూలమాలలు, శాలువాలతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అందరం కలిసికట్టుగా పని చేద్దాం : టీడీపీలో సీనియర్ జూనియర్ అనేది లేదని అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే పార్టీకి విజయాలు దక్కుతాయనిటిడిపి మండల కన్వీనర్ మూలే రామేశ్వర్ రెడ్డి అన్నారు. సొసైటీ పాలక వర్గాల ప్రమాణ స్వీకారోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని సభలో మాట్లాడిన ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆశీస్సులతో నామినేటెడ్ ద్వారా సొసైటీ నూతన చైర్మన్‌గా యువనేత అంబటి వివేకానంద రెడ్డికి అవకాశం కల్పించారన్నారు. కొలిమిగుండ్ల, హనుమంతకుండం సొసైటీల సభ్యుల నియామకంలో కొత్తగా టిడిపిలో చేరిన వారికి అవకాశం కల్పించారన్న ఆరోపణలు సబబు కాదన్నారు. 2024 సాధారణ ఎన్నికలకు ముందే వారు టిడిపిలో చేరారని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గెలుపునకు కృషి చేశారని తెలిపారు. పార్టీలో కొత్త పాత అనేది లేదని అందరికీ సమాన అవకాశాలు, సమాన న్యాయం జరుగుతుందని తెలిపారు. అందరం కలిసి కృషి చేయడంతోనే టిడిపికి మండలంలో మెజార్టీ వచ్చిందని తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహాయ సహకారాలతో పాతబడ్డ కొలిమిగుండ్ల సొసైటీ భవనాల స్థానంలో కొత్త వాటిని నిర్మించడంతోపాటు ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని తెలిపారు. మండలంలోని రెండు సొసైటీలను జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా తీర్చిదిద్ది కృషి చేస్తామన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో టిడిపి నాయకులు జయలక్ష్మి రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్ రెడ్డి, సర్పంచ్ కృష్ణ రంగారెడ్డి, గూలి నాగేశ్వర రెడ్డి, ఎర్రగుడి దస్తగిరి, ఇటిక్యాల శివారెడ్డి, యువ నాయకులు గొంగటి చంద్రశేఖర్ రెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, నంద్యాల ప్రసాద్, ఉమ్మాయిపల్లి గోపాల్ రెడ్డి,మాజీ మండల ఉపాధ్యక్షులు ప్రకాష్ రెడ్డి సొసైటీ సీఈఓ కేశవ ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు రైతులు పాల్గొన్నారు.

ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా నేడు ధర్నా..

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా 6వ తేదీ శనివారం వామపక్ష పార్టీల అధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై విధించిన సుంకాలకు వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలోని సాయిబాబా నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు కె.ప్రసాద్, డి.లక్ష్మణ్‌ల అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.నాగరాముడు, సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మహమ్మద్ గౌస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.సోమన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట లింగం, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, సీపీఎం నాయకులు రామరాజు పాల్గొని మాట్లాడారు... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతీయ వస్తువుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడం జరిగిందని ఈ ప్రకటనను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చాయన్నారు. నిరసన కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని సాయిబాబా నగర్ సర్కిల్లో సిపిఐ సిపిఎం సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర - రుద్రవరం : మండల కేంద్రంలోని చైతన్య ఈఎం యుపి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవంను పాఠశాల కరస్పాండెంట్ జబ్బర్, హెడ్మాస్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూల మాల వేసి ఉపాధ్యాయ బృందం ఘన నివాళి అర్పించారు. అనంతరం కరస్పాండెంట్ జబ్బర్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయుడని తనని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఉపాధ్యాయుడు నేటి సమాజంలో ఆదర్శ ఉపాధ్యాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ భారత రాష్ట్రపతిగా దేశానికి ఎన్నో సేవలు అందించి ఉపాధ్యాయులందరికీ మార్గదర్శకుడయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హుసేని, ఖైర్నుసా బేగం, శ్రీ వాణి, శ్రావణి, విజయలక్ష్మి, విజయ మాధవి, హసీనా, భాగ్యశ్రీ, మహాలక్ష్మి, అమీనా, భువనేశ్వరి, నారాయణమ్మ, బిందు తదితరులు పాల్గొన్నారు.

గురువంటే వెలిగే దీపం..

విశాలాంధ్ర - చాగలమర్రి : చదువు,బుద్ధులు నేర్పే గురువులు వెలిగే దీపంలాంటి వారని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో సహాయ సంచాలకులు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు తన గురువులైన మండలంలోని చిన్నవంగలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1971లో చదువు చెప్పిన ఉపాధ్యాయులైన ఓబయ్య, పురుషోత్తం, నరసింహారెడ్డిలను, ఉన్నత పాఠశాలలో క్రీడలలో ప్రోత్సహించిన పిఈటి బాలమునయ్యతో పాటు పెన్షనర్ల సంఘం నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయుడు విజయరాజులను శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గురువు ఎల్లప్పుడు తమ శిష్యుల అభివృద్ధిని కోరుకుంటారన్నారు. పశు వైద్య సిబ్బంది మహబూబ్‌భాష, శంకరమ్మ, నవీన్, సందీప్‌లు పాల్గొన్నారు.

రైతన్నలకు యూరియాను అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర - బనగానపల్లె : ప్రభుత్వం రైతులకు యూరి యాను అందించాలని సీపీఐ మండల కార్యదర్శి శివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులకు యూరి యాను అందించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని అందువలన ఈనెల 8 తేదీన తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తాహసిల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్నామని రైతులు, సిపిఐ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, సీపీఐ మండల సభ్యులు శివ నాగయ్య పాల్గొన్నారు.

54 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు

విశాలాంధ్ర - మిడుతూరు : మండలానికి 54 మెట్రిక్ టన్నుల యూరియా మంజూ రైనట్లు మండల వ్యవసాయ అధికారి వీరు నాయక్ తెలి పారు.



గురువారం మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు చింతల పల్లి, చౌట్కూరు, చెరుకుచెర్ల, కడుమూరు గ్రామాల్లో రైతులకు యూరి యా పంపిణీ చేశారు. ఏవో మాట్లాడుతూ మండలంలో రైతులందరికీ సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రెండు రోజుల్లో మిగిలిన గ్రామాలకు యూరియా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి తహశీల్దార్ శ్రీనివాసులు, ఏఎస్ఐ హరిప్రసాద్, ఏఈఓ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఆశ్రమం వీధికి చెందిన రైతు చాకలి జ్వాల నరసింహుడు (45) అనే కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. చాకలి జ్వాల నరసింహుడు గత కొన్ని సంవత్సరాలుగా కౌలుకు భూములు తీసుకొని వ్యవసాయం చేసేవాడు. అయితే వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులు చేశారు. అప్పులతో తరచూ ఆవేదనతో ఉండేవాడని అప్పులు పెరగడం ఈమధ్య కురిసిన వర్షా లకు పంట దెబ్బ తినడంతో తట్టుకోలేక ఈనెల మూడవ తేదీన గడ్డి మందు తాగి బలవన్మరణ యత్నం చేశాడు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా అక్కడ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య రమణమ్మతో పాటు ఇద్దరు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం నబీనగర్ ఓల్డ్ టౌన్ ప్రాంతంలో ఇక్రా స్కూల్ నందు మిలాద్ - ఉన్-నబి సందర్భంగా ఆవాజ్ టీవీ, కిమ్స్ హాస్పిటల్, కర్నూల్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గుండె వైద్య శిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ దాదాపుగా 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఏకో పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన రావడం పట్ల ఆవాజ్ టీవీ నిర్వాహకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కొరకు ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ టీవీ ఎడిటర్ ఫిరోజ్, సోహైల్, కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, సాదిక్, మైనార్టీ సంఘాల నాయకులు మహాబాషా, జుబేర్, సమీర్, అడ్వకేట్ సోహైల్ రాణ, హారిస్ బాషా, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా... నలుగురికి గాయాలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండలం ఎగువ అహోబిలం ఓం నమో నారాయణాయ టర్నింగ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఆటో ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎగువ అహోబిలం నుండి దిగువ అహోబిలానికి వస్తున్న ఆటో ఓం నమో నారాయణయ మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న వఢ్ల రాజ్యలక్ష్మి, మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వ్యక్తులను ముందుగా దిగువ అహోబిలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లిఖిత్ రెడ్డి వెంటనే స్పందించి వారికి ప్రథమ చికిత్స చేశారు. వెంటనే వారిని మెరుగైన వైద్యం కోసం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఘనంగా సర్వేపల్లి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని రైతు సేవా సంఘం వారి ఆధ్వర్యంలో జరిగిన భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు, ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు రాష్ట్ర వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ సెక్రెటరీ, ఆత్మకూరు రైతు సేవా సంఘం అధ్యక్షులు మోమిన్ మునీర్ భాష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైఎస్ఆర్సిపి మైనార్టీ సెల్ కార్యదర్శి, రైతు సేవా సంఘం అధ్యక్షులు మోమిన్ మునీర్ భాష, ఆత్మకూరు రైతు సేవ సంఘం అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, కృషి పండ్లతోటల సంఘం అధ్యక్షులు బైరాపురం మహబూబ్ బాషా మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణతో అప్పటి దివంగత మాజీ సర్పంచ్ మోమిన్ హుస్సేన్ సాహెబ్‌కి సన్నిహిత్యం ఉండేదని ఈ సందర్భముగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు రైతులు ముసలముడు రసూల్, బెజ్జం నవీసా, బేగ్ ముర్తుజా, మీసాల మాబు, దుబ్బలింగమూర్తి, టైగర్ బాబు, ఫ్రూట్స్ సత్తార్, వైయస్సార్ భాష, బైరాపురం అక్బరుద్దీన్, షేక్ ఖాదర్ వలీ, రాజామత్, ఇబ్రహీం, ఉప్పు సత్తార్, రాజమద్ గారి అహ్మద్, నష్యం జిలాని, మోమిన్ ఇస్సు, అమలాపురం హనుమన్న, మోమిన్ షరీఫ్, మారుస గారి నబీసా, సుబ్బరాయుడు, శివ వీరితో పాటు మండలంలోని ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్టణంలోని స్థానిక అసార్ మస్జిద్‌లో మొహమ్మద్ ప్రవక్త 1500వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మహమ్మద్ ప్రవక్త యొక్క జన్మదినం సందర్భంగా అసార్ మస్జిద్‌లో ప్రవక్త యొక్క తలనీలాలను ప్రదర్శిస్తారు. ఈ మిలాద్- ఉన్-నబి పండుగ సందర్భంగా ముస్లింలందరూ భక్తి భావంతో ప్రవక్త యొక్క బోధనలు, ప్రవక్త యొక్క ఆచరణలు వారు ఇతరుల పట్ల చూపించే సేవాగుణం, దానం, భక్తి భావంతో తెలుసుకుంటారు. ఈ కార్యక్రమంలో అసార్ మజీద్ ముతవల్లి రహంతుల్లా, మాలిక్, సిమెంట్ ఖదీర్,అమ్మల్లా, పోలీస్ అశ్వక్, ఫ్రూట్ కలీముల్లా, ఫ్రూట్ షాహిన్షా, లాలు, ఎస్ఎంఎస్ రఫిక్, ఇర్ఫాన్, బట్టల హబీబ్, మరియు అధిక సంఖ్యలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

విశాలాంధ్ర - ప్యాపిలి : మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని ముస్లిం సోదరులు శుక్రవారం ఘనంగా మిలాద్ ఉనె నబి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక జామియా మసీదు నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జామియా మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో మత గురువు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని ముస్లిం సోదరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రవక్త చూపిన బాటలో నడిచి పేదలకు తోచిన విధంగా దానధర్మాలు చేయాలన్నారు. క్రమం తప్పకుండా ఐదు పూటలా నమాజ్ ఆచరించాలన్నారు. అనంతరం మసీదులో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మస్తాన్ ఖాన్, మహబూబ్ సాహెబ్, జహంగీర్, రషీద్, మహబూబ్ బాష,మత్తు బాబాసాహెబ్, షేక్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలంలో శుక్రవారం వ్యవసాయ అధికారిణి స్వాతి రైతులకు యూరియా పంపిణీ చేశారు. మండలంలో అన్ని గ్రామాలకి యూరియా సరఫరా చేశాం... 163 మెట్రిక్ టన్స్ యూరియా అన్ని గ్రామాలకు రావడం జరిగిందని చెప్పారు. వెలుగోడు, బోయరేవుల, వేల్పనూరు గ్రామాలలో యూరియా పంపిణి కార్యక్రమం రైతు సేవా కేంద్రాల ద్వారా రెవెన్యూ, అగ్రికల్చర్, పోలీస్ వారి సమన్వయంతో నిర్వహించడం జరిగుతున్నది. తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్,ఎస్. ఐ సురేష్ పాల్గొన్నారు.

యూరియా రైతు సేవ కేంద్రాల ద్వారా పంపిణీ

విశాలాంధ్ర - పాములపాడు : మండలానికి 143.64 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని వాటిని గ్రామాలలోని 8 రైతు సేవ కేంద్రాల ద్వారా పంపిణీ చేసామని మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 143.64 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో రైతులు ఎలాంటి ఘర్షణలు పడకుండా ఎస్సై సురేష్ బాబు పర్యవేక్షించడం జరిగిందని ఆయన తెలిపారు.

ఏడు మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రానికి చెందిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఏడు మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ బాబు శుక్రవారం తెలిపారు. ఈనెల రెండో తేదీన కొలిమిగుండ్ల కు చెందిన బోయ రవికుమార్ పై అదే గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ తో పాటు మరో ఆరుగురు దాడి చేసి కొట్టారన్నారు. పాత కక్షలను మనసులో పెట్టుకొని రవికుమార్ తన షాపు వద్ద ఉండగా ఏడుగురు కట్టెలతో దాడి చేసి కొట్టారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా మృతి.. తక్షణ సాయం

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోగల ఎస్సీ కాలనీలో పి చిన్న పకీరమ్మ అను మహిళ శుక్రవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గాజ కృష్ణారెడ్డి మృతదేహం వద్దకు వచ్చి నివాళులు అర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం తక్షణ సహాయంగా ఆర్థిక సహాయం అందజేసి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. మాజీ వైస్ ఎంపీపీ గాజ కృష్ణారెడ్డి వెంట పలువురు వైసిపి కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

గొర్రుతో సేద్యం చేస్తున్న రైతు

విశాలాంధ్ర - చాగలమర్రి : చాగలమర్రి పట్టణానికి చెందిన బాలకృష్ణ అనే కౌలురైతు కూలూరు రస్తా సమీపంలోని పొలంలో ఎద్దులు, ట్రాక్టర్‌లతో సేద్యం చేసే ఆర్థిక పరిస్థితి లేక తన పొలాన్ని తానే దున్నుకుంటున్నాడు. కుటుంబీకుల సాయంతో తను కౌలుకు తీసుకున్న అర ఎకరాలో భూమిని దున్నుతూ ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాడు. కౌలు రైతు బాలకృష్ణ గొర్రు పట్టుకుని తానే సేద్యం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులో ఉన్న వ్యవసాయ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను కొనసాగించేందుకు సాయం చేయాలని కోరుతున్నారు.

గోపవరం ఘటనపై తప్పుడు ప్రచారం ఆపాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గోపవరం ఘటనపై తప్పుడు ప్రచారం ఆపాలని మహానంది మండల టీడీపీ కన్వీనర్, కేసీకెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ బన్నూరు రామలిం గారెడ్డి వైసిపి మాజీ ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డికి హితవు పలికారు. నంద్యాల కేసి కేనాల్ ప్రాజెక్టు కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బన్నూరు రామలింగారెడ్డి మాట్లాడుతూ గోపవరం ఘటనపై తప్పుడు ప్రచారం ఆపాలని, నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని మండిపడ్డాడు. బాధితుడి పాత గాయాలు చూపించి కొత్తగా తెలుగుదేశం పార్టీ నాయకులు కత్తితో దాడి చేసినాక కారంపొడి చల్లి నట్టుగా అపోహలు సృష్టించి గ్రామాలలో గొడవలు సృష్టించడం మంచి పని కాదని హితవు పలికారు. ఐదేళ్ల పాలనలో మీరు చేసిన అరాచకాలు అనేకం ఉన్నాయని, గ్రామాల్లో కక్షలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసి, గొడవలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నాడని మండిపడ్డారు. ప్రతిసారి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై అవాకులు చవాకులు మాట్లాడడం అలవాటుగా మార్చుకు న్నాడని ఎద్దేవా చేశాడు. ఇప్పటికయినా బుడ్డాపై తప్పుడు ఆరోపణలు చేస్తే సాహించేది లేదన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : ఇజాజ్

విశాలాంధ్ర - శిరివెళ్ల : రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారికి ప్రాణదానంతో సమానమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీసీనియర్ నేత దొర్నిపాటి రఫీ కుమారుడు వైసిపి యూత్ లీడర్ ధోర్నిపార్టీ ఇజాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కటిక సెంటర్ సమీపంలో గల ఆటోస్టాండ్ వద్ద దోర్నిపాటి ఇజాజ్ శుక్రవారం రక్తదానం చేశారు. ఆయనతోపాటు వందలాదిమంది యువకులు మిలాన్ నబీ పండుగ సందర్భంగా రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారని ఇజాజ్ పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానమునకు ముందుకు రావాలని రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరమవుతుందని, గర్భిణీ బాలింత మహిళలకు రక్తహీనత గల వారికి దాతల నుండి సేకరించిన రక్తాన్ని వారికి అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.. ప్రతీ ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సమయాలలో సైతం రక్తదానం చేయడం మానవతా హృదయంతో ఇతరుల పట్ల స్పందించడం జీవితంలో ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

సురవరం పేరు గుర్తుండేలా చర్యలు తీసుకోవాలి

▸▸ సురవరం జీవిత చరిత్ర పుస్తకం తీసుకురావాలి

▸▸ పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి విద్యార్థి ఉద్యమాలు ప్రారంభించి, జాతీయ స్థాయిలో ఎదగడానికి కారణమైన కర్నూలు నగరంలో ఆయన పేరు గుర్తుండేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని, సురవరం జీవిత చరిత్ర పుస్తకం తీసుకు రావాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పి.రామ చంద్ర య్య అన్నారు. శుక్రవారం సీపీఐ జిల్లా సమితి ఆద్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించి, రెండు నిముషాలు మౌనం పాటించారు. అంతకుముందు సంస్మరణ సభ నుద్దేశించి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.డాక్టర్ నారాయణ ప్రసంగిం చారు. అనంతరం రామచంద్రయ్య మాట్లాడుతూ కర్నూలు నుండి విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొని సీపీఐ జాతీయ ప్రదాన కార్యదర్శిగా ఎదిగారన్నారు. ఆయన ఆలూరు నియోజకవర్గం మలగవెళ్ళి గ్రామంలో భూస్వామికి వ్యతిరేఖంగా పోరాటం చేసి 1100 ఎకరాలు పంపిణీ చేసిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. జిల్లాలోని పత్తికొండ, డోన్ తాలుకాలో భూస్వామ్య పెత్తందారులకు, ఫ్యాక్షన్‌కు వ్యతిరేఖంగా జరిగిన పోరాటంలో సురవరందే కీలకపాత్ర ఉందన్నారు. 1994లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి డోన్ నియోజకవర్గంలో పోటీ చేస్తే ఆయనపై సురవరం సుదాకరరెడ్డి పోటీ చేశారన్నారు. గ్రామాల్లో పెత్తందారులు ప్రచారం చేయకుండా అనేక అవాంతరాలు సృష్టించినా అనేక గ్రామాల్లో ప్రచారం నిర్వహించడం జరిగి ందన్నారు. అధికారం అడ్డపెట్టుకుని దౌర్జన్యాలు చేయడం వలన సురవరంకు సుమారు 30వేలకు పైగా ఓట్లు వచ్చా యన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు మాట్లాడుతూ సుర వరం సుధాకర్‌రెడ్డి ఒక గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయుడని, ఆయన విద్యార్థి ఉద్యమాల నుండి యువజన సంఘం నాయకునిగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ ప్రదాన కార్యదర్శిగా ఎన్నో పదవులు అలంకరించారన్నారు. అంతకు కుముందు రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, వైసీపీ జిల్లా అద్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ నగర కార్యదర్శి పి.రామ క్రిష్టారెడ్డి, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, సీపీఐఎంఎల్ నాయకులు సుంకన్న, బస్తిపాడు రామకృష్ణారెడ్డి, విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతామాధురి, సీపీఐ సీనియర్ నాయకులు సూర్య నారాయణరెడ్డి సీపీఐ వి.భీమలింగప్ప, మనోహర్‌మాణిక్యం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాధం, నభిరసూల్, పంపన్న గౌడ్, రాజాసాహెబ్, చంద్రశేకర్, రంగన్న, శ్రీనివాసులు, విరూపాక్షి, రాజు, భాస్కర్‌యాదవ్, కారుమంచి, శ్రావని, ఏఐఎస్ఎఫ్ జిల్లా అద్యక్షులు సోమన్న, సహాయ కార్యదర్శి శరత్,, ఎఐవైఎఫ్ నాయకులు బీసన్న, రాజు, బార్‌కౌన్సిల్ మెంబర్లు రవిగువేరా, సుధాకరరెడ్డి మిత్రులు, సీపీఐ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడి అలరించారు.

ప్రవక్త బోధనలను అందరూ పాటించాలి

విశాలాంధ్ర-హొళగుంద: దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహివా సల్లం వారి బోధనలను అందరూ పాటించాలని సున్ని మస్జిదే మొహమ్మదియా మౌలి టిప్పు రాజా కోరారు. ఈద్ మీలాద్ పండుగ సందర్భంగా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగ మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈద్ మిలాద్ పండుగ సందర్భంగా మసీదులు ముస్లిం సోదరులకు నిండిపోయాయి. మక్కా మదీనా చిత్ర పటాలను పురవీధుల్లో ముస్లిం సోదరులు ఊరేగించి నారే తక్బీర్, అల్లాహు అక్బర్ నినాదాలు ఇచ్చారు. జాతీయ జెండాను ఊరేగించి దేశభక్తి చాటారు. ఈ సందర్భంగా మౌలిటిపు రాజ మాట్లాడుతూ దైవ ప్రవక్త జన్మదిన ఆచరించడం ఎంతో సంతోషంగా ఉన్నదనిసర్వమానవాళికి ప్రవక్త శాంతి సందేశాన్ని ప్రసాదించారని ఉపన్యసించారు. ముస్లిం సోదరులు అందరితో కలిసి మెలిసి జీవించాలని దేశ పురోభివృద్ధికి అందరూ కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఆయా మసీదుల్లో అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈద్ మిలాద్ పండుగను ముస్లిం సోదరులు ఘన ంగా ఎస్సై దిలీప్ కుమార్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు ముస్లిం సోదరులు బంధు మిత్రులకు, హిందూ, క్రిస్టియన్ సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శ ఉపాధ్యాయుల ఎంపికలో ఎంఈఓల తీరుపై సర్వత్రా విమర్శలు

విశాలాంధ్ర-పత్తికొండ: ఆదర్శ ఉపాధ్యాయులను ఎంపిక చేయడంలో పత్తికొండ మండల ఎంఈఓలు అత్యుత్సాహం ప్రదర్శించారని విమర్శలు ఉపాధ్యాయ సంఘాలలో నెలకొన్నాయి. మండలంలోని వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు వారి విధుల పట్ల నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారి సేవలను గుర్తించకుండా కేవలం తమ కార్యాలయంలో పనిచేస్తున్న వారిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం సరైంది కాదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకితభావంతో పని చేసే వారిని గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయాలన్నారు.

జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జాతీ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా ఈన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపతానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ కృపాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్ఎం హుస్సేని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర - చిప్పగిరి: రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్బర్ వలి (35) మృతి చెందిన సంఘటన శుక్రవారం చిప్పగిరిలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆలూరుకు చెందిన అక్బర్ వలి ఆయన స్నేహితుడు ఆసిఫ్ ద్విచక్ర వాహనంపై గుంటకల్ నుండి చికెన్ పకోడకి సంబంధించిన సరుకులను తీసుకొని ఆలూరుకు వెళ్తున్న సమయంలో మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీం కుందన గుర్తి గ్రామయి నుండి మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తూ చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాపనాన్ని ఢీకొన్నాడు. ఆలూరు చెందిన అక్బర్ వలి మృతి చెందడం జరిగిందని చిప్పగిరి హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. దీంతో కేసు నమోదు వేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

విశాలాంధ్ర -ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఆయా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జామియా మసీద్ నుండి ముస్లిం సోదరులు జెండా చేతబట్టి నారే తక్బీర్ అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. జామియా మసీదు, ఖునీ పంజా మైదానం, సున్నం బట్టి మసీదు, గోనెగండ్ల రోడ్డు, హాఫిజ్ మసీదు, గాంధీ సర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా తిరిగి జామియా మసీదు వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.

విద్యా బోధనలో ఉన్న తృప్తి మరే ఉద్యోగంలో లేదు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిద్దడం ద్వారా సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురు పూజోత్సవం-2025 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధ్యాపకునిగా జీవితాన్ని ప్రారంభించి, భారత రాష్ట్రపతిగా సేవలు అందించి, భారతరత్నగా కీర్తింపబడిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయులను గౌరవించుకోవాలన్న ఉద్దేశంతో 1962 నుండి సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. తల్లి, తండ్రి తర్వాత గురువును పూజించే సంప్రదాయం అనాదిగా వస్తోందని, ఈ సంప్రదాయం తరతరాలకు వర్థిల్లాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ నిధుల నుండి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలకు రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులు, మార్గదర్శకులు అని కొనియాడారు. మాతృ దేవో భవ, పితృ దేవో భవ, ఆచార్య దేవో భవ అని పెద్ద స్థానాన్ని గురువులకు ఇవ్వడం జరిగిందని, ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించాలని సూచించారు. గురువులు నేర్పిన క్రమశిక్షణ, విద్యా బుద్ధుల వల్లనే మనం ఈ స్థానానికి చేరుకున్నామని గుర్తుంచుకోవాలన్నారు. మట్టిలోని మాణిక్యాల విద్యార్థులను వెలికి తీసేది ఉపాధ్యాయులేనని, శిలలను శిల్పాలుగా తీర్చిదిద్దే శిల్పుల లాంటి వారు ఉపాధ్యాయులు అని ఎమ్మెల్యే ప్రశంసించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు చేశారని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర అని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అని పథకాలకు మహనీయుల పేర్లు పెట్టామన్నారు. విద్యను ఎవరూ దొంగిలించలేరని, విద్యను అశ్రద్ధ చేయవద్దని ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతి, రాష్ట్ర బొందిలి వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధారానగర్ విక్రమ్ సింగ్, డీఈవో శామ్యూల్ పాల్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకం అని ప్రశంసిస్తూ ప్రసంగించారు. అనంతరం 31 మంది ఉపాధ్యాయులకు 14 మంది ఇంటర్మీడియట్ విద్యకు అధ్యాపకులకు కలెక్టర్ ఎంపీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు

సచివాలయానికి మట్టి రోడ్డు ఏర్పాటు

విశాలాంధ్ర-గూడూరు: మండలంలోని చనుగొండ్ల గ్రామం ఒకటో సచివాలయానికి మట్టి రహదారిని ఏర్పాటు చేశారు. రహదారి వెంట గుంతలుపడి, నీరు నిల్వచేరి, రాకపోకలకు ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో ప్రజల ఫిర్యాదు మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి ఎం.మధు పంచాయతీ నిధులతో రహదారికి మట్టి వేసి, చదును చేశారు. రహదారితో పాటు సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఆవరణ ముందు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చదును చేయడంతో పలువురు ప్రశంసించారు.

అక్రమ ఇసుక ట్రాక్టర్ల రవాణాతో రోడ్లు ధ్వంసం

విశాలాంధ్ర - హొళగుంద: మార్లమడికి సమీపంలోని ప్రవహించే వేదావతి నది నుండి కొందరు రాత్రి వేళల్లో అక్రమ ఇసుకను తరలించడంతో ఎస్సీ కాలనీలోని రోడ్డు ధ్వంసం అవుతున్నాయని సర్పంచ్ ఎంకప్ప శుక్రవారం తెలిపారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లు అతివేగంగా భారీ శబ్దంతో వెళుతున్నాయని, దీనివల్ల కాలనీ వాసులకు ఇబ్బందిగా ఉన్నదని వాపోయారు. పంచాయతీ నిధులతో గ్రామంలోని వీధుల రోడ్లకు 300 ట్రిప్పులు మట్టి వేసి చెదును చేశామని రోడ్లపై అక్రమ ఇసుక ట్రాక్టర్లు ప్రమాణించడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని ఉన్న ప్రజల రాకపోకలకు కష్టంగా మారిందని అన్నారు. రాత్రి వేళలో అక్రమ ఇసుక ట్రాక్టర్లు పశువుల మీద వెళ్లి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయని, దీనివల్ల పశువుల యజమానులు ఎవ్వరికీ చెప్పుకోలేక మిన్నుకుండిపోయారని సర్పంచ్ ఎంకప్ప ఆవేదన చెందారు. అక్రమ ఇసుక ట్రాక్టర్లు రోడ్లపై తిరగడం వల్ల రోడ్లు గుంతల మయంగా మారాయని వర్షం నీరు గుంతలో నిలబడి దుర్గంధంగా ఉన్నాయని అన్నారు. అక్రమ ఇసుక ట్రాక్టర్లు కాలనీలో వెళ్లకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్ద రమేష్ విజ్ఞప్తి చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు బాధ్యతను పెంచింది

విశాలాంధ్ర -ఆదోని : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని ఉపాధ్యాయుడు సునీల్ రాజ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కర్నూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ రంజిత్ భాష, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముల్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సునీల్ రాజ్ కుమార్ కుటుంబ సమేతంగా అందుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గతంలో కిల్చిన పేట మున్సిపల్ హై స్కూల్లో ప్రధానోపా ధ్యాయుడిగా పని చేయడం జరిగిందని, బదిలీపై ప్రస్తుతం ఆదోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నానని తెలిపారు. చేసిన సేవలను గుర్తించి ఉపాధ్యాయుల దినోత్సవం రోజు ఉత్తమ ఉపాధ్యా యుడిగా కుటుంబంతో కలిసి అవార్డు అందుకోవడం సంతోషంతో పాటు మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. ఆదోని మండలం పెద్ద హరివాణం జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రామన్న ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు చాలా అవసరమని విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరినాటి నుండి నేటి వరకు ఎంతోమందిని రాష్ట్ర జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొనేలా తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. రానున్న కాలంలో విద్యార్థులు దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి మరిన్ని పోటీల్లో పాల్గొనేలా కృషి చేస్తానన్నారు.

అటికెల గుండులో తాగునీటి కష్టాలు

విశాలాంధ్ర - పత్తికొండ: మండల పరిధిలోని అటికెల గుండులో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటికెల గుండు గ్రామంలో సుమారు 1500 కుటుంబాలు నివాసం ఉన్నాయి. నివాసాలకు తగ్గట్టు తాగునీటి సరఫరా లేకపోవడంతో గ్రామ ప్రజలు నీటి కోసం వాటర్ ట్యాంకుల దగ్గర మూడు చక్రాల తోపుడుబండ్లతో బారులు తీరారు. వారానికి ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, నీళ్లు వచ్చినప్పుడు పట్టుకుంటే మూడు లేదా నాలుగు బిందెలకు మాత్రమే నీళ్లు వస్తున్నాయని, ఆ తర్వాత నీటి కోసం నానా కష్టాలు పడుతున్నామన్నారు. ఈ విషయమై ఎంపీడీవో కవితను వివరణ కోరగా గ్రామానికి వెళ్లి నీటి సమస్యపై విచారణ చేపడతామన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

విశాలాంధ్ర - ఆలూరు: మండలంలో అరికెర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాఠశాల పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులుగా ఎంపిక య్యారు. ఇందులో బాల చంద్ర ఫిజికల్ సైన్స్, వాల్మీకి శ్రీనివా సులు బయలాజికల్ సైన్స్, వారు ఈ పాఠశాల అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధిస్తుండడంతో క్రమంగా పాఠశాలలో విద్యార్థుల బాగా మొరగవుతున్నారని చెప్పారు. బొమ్మలు, డ్రాయింగ్, ఆటలు, పాటలతో పాఠాలు బోధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. వారి కృషితో ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థులు బాగా చదువుతున్నారని చెప్పారు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని అభినందించారు.

కౌలు రైతులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని నలకదొడ్డి గ్రామంలో కౌలు రైతుల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా పంట రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకులలో ఉన్న అన్ని రకాల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంటల బీమా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం నాయకులు రవికుమార్, నరేష్, రంగన్న, మల్లికార్జున, సోమలింగప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పంటలను రైతులు మార్కెట్‌లో విక్రయించుకోవాలి

విశాలాంధ్ర - ఆస్పరి : రైతులు తమ కష్టార్జిత పంటలకు గిట్టుబాటు ధరలు పొందాలంటే వాటిని నేరుగా మార్కెట్ లో విక్రయించుకోవాలని వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాల బొజ్జమ్మ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బిల్లేకల్లు గ్రామంలో కూరగాయల మార్కెట్‌ను వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుందని, విత్తనాల సబ్సిడీలు, పంట బీమా, ఉచిత విద్యుత్ సరఫరా, నీటిపారుదల ప్రాజెక్టులు, రుణ మాఫీ వంటి పథకాల ద్వారా రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసాను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. రైతుల మధ్య దళారులను ఆశ్రయించకుండా పంటలను నేరుగా మార్కెట్‌లో విక్రయించడం ద్వారా లాభాలు పొందవచ్చున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు వస్తాయని, ఉదాహరణ బిల్లేకల్లుకు చెందిన తలారి వెంకటేశులను గుర్తించి ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని అధిష్టానం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం మార్కెట్లో తిరుగుతూ రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ నూతన కాంట్రాక్టర్ బాట తిక్కయ్య, మాజీ ఎంపీపీలు కృష్ణ యాదవ్, వెంకటేష్‌లు, మాజీ సర్పంచ్ సంజమ్మ, మాజీ జెడ్పీటీసి ఉచ్చీరప్ప, దేవనకొండ టీడీపీ కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, జనసేన మండల కన్వీనర్ అరవింద్, కృష్ణమూర్తి, వీరన్న ఆచారి, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన

విశాలాంధ్ర - గోనెగండ్: స్థానికంగా వెలసిన శ్రీశ్రీశ్రీ ఆది చింతల ముని స్వామి నల్లారెడ్డి స్వామి వారి దశమి మహోత్సవం సందర్భంగా గోనె గండ్ల ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ట్రాక్టర్ యూనియన్ నాయకులు కె.ఉసేన్, గానిగ రహామ్‌తుల్లా, శివన్న, డి.నూర, గోపాల్, వెంకటేష్, మాబు, భాస్కర్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల దశమి మహోత్సవం సందర్భంగా ఎద్దుల బలప్రదర్శన ఈ నెల 13, 14, 15 తేదిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న నాలుగుపళ్ళ సైజ్ బహుమతులు మొదటి బహు మతి రూ.30వేలు, రెండవ బహుమతి రూ. 20వేలు, మూడో బహుమతి 15వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు, ఐదవ బహుమతి రూ.5వేలు, ఆరో బహుమతి రూ.3 వేలు, దీనికి ఎంట్రీ ఫీజు రూ.500 ఇచ్చి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. 14న ఆరుపళ్ల సైజ్ బహుమతులు వివరాలు మొదటి బహుమతి 40వేలు,రెండవ బహుమతి 30వేలు, మూడవ బహుమతి రూ.20వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు, ఐదవ బహుమతి రూ.5వేలు, ఆరవ బహుమతి రూ.3 వేలు, వీటికి ఎంట్రీ ఫీజు రూ.600 మాత్రమే, 15న జరిగే న్యూక్యాటగిరి బహుమతులు, మొదటి బహుమతి 50వేలు,రెండవ బహుమతి 40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.5 వేలు, ఇందుకు ఎంట్రీ ఫీజు రూ.700 ఉంటుంన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర - కోడుమూరు : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. శుక్రవారం ఎమ్మార్పీఎస్ కోడుమూరు మండల అధ్యక్షుడు నాగేష్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మల్లెపోగు లాలు అధ్యక్షతన జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమా నికి ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, ముఖ్య అతిధిగా హాజరై జెండాను ఎగుర వేశారు. ఆంధ్రయ్య మాట్లాడుతూ మహాజననేత, ఉద్యమాల పులిబిడ్డ, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కోడుమూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జెండా విష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు ఎల్లప్ప, మద్దిలేటి, సుధాకర్, వెలుగు ఎల్లప్ప, ఎంఎస్పీ జిల్లా నాయకులు లక్ష్మన్న, కట్టెల రాజు, రత్నం, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు బీసీ రాజు, ఉపాధ్యక్షులు రాము తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సప్తభజనలు

విశాలాంధ్ర - ఆలూరు : మండలం పెద్దహొతూరు గ్రామంలో వెలసిన సనాతన గోత్రోద్భవ తపోనిష్ఠా, అవదూత ఉచ్చిరప్ప తాత గారి మఠంలో చేపట్టిన సప్తభజన కార్యక్రమం గురువారం నాటికి ఏడు రోజులు పూర్తి అయ్యిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన సప్తభజనలు సందర్భంగా ఆలయంలో వెలసిన ఉచ్చీరప్ప తాత మూలవిరాట్‌కు ప్రత్యేక పూలతో అలంకరించి నిరంతరం పూజలు నిర్వహిస్తున్నారు. హంపి పాదయాత్ర అనంతరం చేపట్టిన సప్త భజన కావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని, ఈ పూజ కార్యక్రమాలకు గ్రామస్థులే కాక ఇతర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొటున్నారని వారు తెలిపారు.

ఊరి పేరును సరిచేసిన సెక్రెటరీ

విశాలాంధ - హొళగుంద: హొళగుంద నుండి మార్లమడికి వరకు కూటమి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలతో కొత్త రోడ్డును నిర్మించింది. కొత్త రోడ్డుకు అధికారులు హొళగుంద ఊరి పేరు ఉన్న బోర్డును బిగించారు. కొందరు ఆకతాయిలు బోర్డును క్రిందకు తిప్పడంతో ఊరి పేరు బోర్డు తిరగబడింది దీనితో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించిందని డ్రైవర్లు తెలిపారు. విశాలాంధ్ర పత్రికలో గురువారం ప్రచురించిన తిరగబడిన ఊరి పేరు అనే శీర్షికతకు గ్రామ సర్పంచ్ రంగమ్మ, సెక్రెటరీ బి.రాజశేఖర్ గౌడ్ స్పందించారు. తిరగబడిన ఊరి పేరు బోర్డును శుక్రవారం సిబ్బంది ద్వారా సక్రమంగా సవరించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండ పోయింది. ఊరి పేరు బోర్డు సక్రమంగా ఉంటే గ్రామాన్ని గుర్తించి, ఊరిని చేరుకుంటామని వాహనాల డ్రైవర్లు, యజమానులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ప్రజా ఆస్తులుగా గుర్తించి కాపాడుకోవాలని సెక్రెటరీ రాజశేఖర్ గౌడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకుంటున్న కళాదర్శన్ ఆర్ట్స్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : స్థానిక ఎస్టీబీసీ మైదానంలో కళా దర్శన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎక్స్ పో ఎగ్జిబిషన్ కం సేల్ ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటుచేసిన వస్త్రాలను, పలు రకాల వస్తువులను చూసేందుకు వందలాదిగా తరలివస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్ మేనేజర్ మహమ్మద్ ముజీబ్ అన్సారి మీడియాతో మాట్లాడుతూ భారతదేశం భిన్న మతాలతో, విభిన్న సంప్రదాయాలతో భిన్నత్వంలో ఏకత్వమై, హస్తకళలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతోందని అన్నారు. తమ కళా దర్శన్ ప్రదర్శనలో గుజరాతి, పంజాబీ కాశ్మీరి, తదితర రాష్ట్రాలకు చెందిన వస్త్రాల ప్రదర్శన మా ప్రత్యేకత అన్నారు. చిన్న పిల్లల ఆట వస్తువులు, సోఫా సెట్లు, బెడ్ షీట్స్, కుర్తా పైజామా, సఫారీ సూట్స్, వంట సామాగ్రి వివిధ రాష్ట్రాలకు చెందిన పట్టు వస్త్రాలు, చీరలు, ఖాదీ వస్త్రాలు, ఇవే కాక చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు, సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు కావలసిన అన్ని రకాల వస్తువులు మా దగ్గర అతి తక్కువ ధరకే లభిస్తాయి అని వారు తెలిపారు. చిన్నపిల్లలకు బోటింగ్ వంటి వినోద కార్యక్రమాలు ఉన్నాయన్నారు. కళా ప్రదర్శనకు విచ్చేసేవారికి ఎంట్రీ, పార్కింగ్ సౌకర్యం ఉచితంగా అందించడం తమ ప్రత్యేకత అని ఆయన తెలిపారు. కర్నూలు నగరంలో కొద్ది రోజులు మాత్రమే ఉండే ఈ కళా ప్రదర్శనను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి మహాసభకు తరలిరండి..

విశాలాంధ్ర - నందవరం : వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి మహాసభలకు రజకులకు తరలిరావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం నందవరం, సోమల గూడూర్, కనకవీడు, నాగలదిన్నె, కైరవాడి, పెద్దకొత్తిలి గ్రామాలను సందర్శించి రజకులకు ఆహ్వాన పత్రికలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరనారి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి మహాసభను 10న ఎమ్మిగనూరు పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. రజక వృత్తిదారుల కుటుంబంలో జన్మించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారిగా ఐలమ్మ నిలిచిందని, పేద ప్రజల భూములను లాక్కోవడానికి ప్రయత్నించిన ఆనాటి నిజం నవాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపించిన వీర మహిళ మన ఐలమ్మ అని కొనియాడారు. అనేక చిత్రహింసలకు గురిచేసిన ప్రభుత్వాన్ని ఎదురుగా నిలిచిన ఆమెను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 2000లో అప్పటి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా బషీర్ బాగులో జరిగిన విద్యుత్ ఉద్యమంలో పోరాటం చేస్తూ బుల్లెట్ గాయాలకు నేలకొరిగిన ఉమ్మడి రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ మన వర్గానికి ఆదర్శమైన నాయకుడని, వారిని ఆదర్శంగా తీసుకొని పోరాటం చేస్తూ మన మహిళలపైన, మనపైన జరుగుతున్న అన్యాయాలకు ఎదురుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దైవందీన్నే సి.హనుమంతు, ఇబ్రహీంపురం సి.ఎల్లప్ప, నందవరం సి.భీమన్న పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూదానం చేశాం

విశాలాంధ్ర - హొళగుంద: కోగిల తోట జిల్లా పరిషత్ హై స్కూల్‌కు 1962లో తన తండ్రి కేజే విరుపాక్షి రెడ్డి ఒక ఎకరా భూదానం చేశారని మాజీ సర్పంచ్ కేజే వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1962 సంవత్సరంలో తమ ముత్తాత అయిన కేజీ చన్న నగౌడ పేరిట కేజే చెన్నన గౌడ సమితి ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ మద్దూరు సుబ్బారెడ్డి, ఆలూరు సమితి చైర్మన్ చిప్పగిరి లింగారెడ్డి, కేజే విరుపాక్షి రెడ్డిలు శంకుస్థాపన చేశారన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి భూదానం చేసి విద్యాభివృద్ధి చేసిన తమ కుటుంబంపై సర్పంచ్ లేనిపోని నిందారోపణలు చేయడం తగదని అన్నారు. తమ తండ్రి కేజే విరుపాక్షి రెడ్డిల్యాండ్ సీలింగ్ రాక మునుపే పాఠశాలకు భూదానం చేశార ని అయితే ఇప్పుడు ఎవరు భూదానం చేయలేదని, అది ప్రభుత్వ స్థలం అని సర్పంచ్ చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. తాను సర్పంచ్‌గా ఉన్న హాయంలో పాఠశాల వద్ద పెద్దపెద్ద గుంతలు ఉండేవని పాఠశాలకు వెళ్లేవారు, విద్యార్థులు, మహిళలు నానా అవస్థలు పడి తిరిగేవారని అన్నారు. ఎంపీడీవో వరలక్ష్మి సహాయంతో పనికి ఆహారం పథకం ద్వారా పెద్దపెద్ద గుంతలను పూడ్చివేసి ప్రజల రాకపోకలకు కొత్తరోడ్డు నిర్మాణం చేపట్టానని అన్నారు. తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వద్దకు వెళ్లి రూ.7 లక్షల నిధులు తీసుకువచ్చి సమ్మత గిరి నుండి కొత్తగా పైప్ లైన్ వేసి కోకిల తోట గ్రామ ప్రజలకు తాగునీరు అందించామని, సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణంతో పాటుగ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని అన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి భూదానం చేయడమే కాక గ్రామాల్లో అభివృద్ధికి తమ కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉన్నదని అన్నారు అలాంటి కుటుంబం పై నిందారోపణలు చేయడం తగదని భూదానం చేయలేదంటూ గ్రామంలోని హెడ్మాస్టర్, ఉపాధ్యాయులపై సర్పంచ్ బెదిరించడం మంచి పద్ధతి కాదని స్పష్టం చేశారు. గ్రామంలో తమ కుటుంబం ఎంతో గౌరవంతో ప్రజలతో కలిసి మెలిసి ఉంటుందని దానిని సర్పంచ్ గుర్తించాలని అన్నారు. కోర్టు ఆదేశాలను అందరూ శిరసా వహించాలని కోర్టు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. సమస్యను సామరస్యంగా కూర్చుని పరిష్కరించుకోవాలని కోరారు

భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తాం

విశాలాంధ్ర -హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గా ఉరుసు ఉత్సవాలు 18న గంధం, 19న ఉరుసు, 20న జియారత్ కార్యక్రమాలు జరుగుతా యని సర్పంచ్ కురువ చాముండేశ్వరి శుక్రవారం తెలిపారు. ఉరుసు మహెూ త్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటా మని అన్నారు. గ్రామంలో వీధి దీపాలను విద్యుత్ సిబ్బందితో బిగించామని, తాగునీరు సదుపాయాలు కల్పించడానికి చర్యలు చేపట్టామని పారిశుద్ధ్య లోపించ కుండా పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా చెత్తను ఎత్తివేశామని గుంతల రోడ్లను ఎర్రమట్టితో పూడ్చామని, ఉరుసు మహెూత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ కార్యదర్శి షఫీ ఏర్పాట్లను చూస్తున్నారని, దర్గాను అధికారులు అన్ని హంగులతో ముస్తాబు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, దర్గన్న, ఈరన్న పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్

విశాలాంధ్ర - పెద్దకడబూరు: ఉపాధ్యాయులందరికీ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శ ప్రాయుడని రేయిన్ బో ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక రేయిన్ బో ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ప్రసాద్, పుల్లయ్య, ఫ్రాన్సిస్, శామ్యూల్, నూర్, అశోక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో సర్వే పల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతిగా, ఉప రాష్ట్రపతిగా దేశానికి సేవలందించిన మహెూన్నత వ్యక్తి, గొప్ప విద్యావేత్త, తత్వవేత్త, సామాజిక వేత్త సర్వే పల్లి రాధాకృష్ణన్ అని ప్రిన్సిపాల్ అన్నారు. కళాశాల విద్యార్థులు మదన్ కుమార్, ఇమ్రాన్ వినూత్న కథనం ద్వారా విద్యా రంగానికి సర్వేపల్లి అందించిన ఎనలేని సేవలను వివరిస్తూ, అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమైనదని, భారత రత్న అవార్డు పొందిన సర్వేపల్లి రాధాకృష్ణన్ మహెూన్నత వ్యక్తి అన్నారు. అధ్యాపకులు మల్లికార్జున, రామకృష్ణ విజయశేఖర్, లక్ష్మి, సుజాత, గిరిజారాణి, చిన్న మల్లేశ్వరుడు, ఉల్గోజి రావు, శ్రీధర్, లావణ్య, శ్రావణి, జసింత, బాల శంకర్ పాల్గొన్నారు.

వెలుగోడు నుంచి ఉత్తమ ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - వెలుగోడు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు పొందారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నరసింహులు, మొహియుద్దీన్‌లకు జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. వీరిని వెలుగోడు మండలం ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు సేవ కేంద్రాలకు 30 వేల బస్తాల యూరియా

విశాలాంధ్ర – కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాలకు 30 వేల బస్తాల యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు కోవెలకుంట్ల ఏడిఏ సుధాకర్ తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి ఏడీఏ సుధాకర్ విలేకరుల సమావేశంలో ప్రకటన విడుదల చేశారు. కోవెలకుంట్ల మండలానికి 4309 బస్తాలు, దొర్నిపాడు మండలానికి 1976, ఉయ్యాలవాడ మండలానికి 2693, సంజామల మండలానికి 6463, కొలిమిగుండ్ల మండలానికి 3770, అవుకు మండలానికి 10773 బస్తాల యూరియా ఆ రైతు సేవా కేంద్రాలకు అందించడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతులందరూ మండల వ్యవసాయ అధికారి తో పంట ధ్రువీకరణ పత్రం రాయించుకుని ఆయా రైతు సేవా కేంద్రాలలో యూరియా తీసుకోనగలరని తెలిపారు.

ఘనంగా ఎస్టీయూ ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఎస్టియు ఆదోని, కౌతాళం మండలాల సమితి ఆధ్వర్యంలో ఆదోని మండల కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మధ్యకాలంలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన సీనియర్ ఉపాధ్యాయులు వరాహలమ్మ, అబ్దుల్ నబీ, నరసింహారెడ్డిలను ప్రధానోపాధ్యాయులైన రమేష్ నాయుడు, సత్యన్నా ఘనంగా శాలువాగప్పి సన్మానం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల స్థానం ఎంతో ఉన్నతమని, ఎంతోమంది భావి భారత పౌరుల జీవితాలను తీర్చిదిద్దుతూ దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వామ్యం కావడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయ వృత్తిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విధానాలకు తమను తాము అన్వయించుకుంటూ, అందులో ఉన్న మెలకువలు నేర్చుకుంటూ విద్యార్థులతో మమేకమై ఉత్తమ వృత్తులను సమర్థవంతంగా నిర్వహిస్తే మనం మన వృత్తులకు న్యాయం చేసిన వారమవుతామన్నారు. చదువు చెప్పిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి మనల్ని గుర్తుపెట్టుకుని నమస్కరించి మేము మీ వల్లనే ఫలానా ఉన్నామని చెప్పే ఒక్క మాట ఏ ఉపాధ్యాయుడికైనా అవార్డుల కంటే ఉత్తమమైన అవార్డు గొప్పది అన్నారు. నేటి సమాజంలో విద్యార్థులకు విద్యతో పాటు వారు ఎలాంటి చెడు అలవాట్లకు మత్తు పదార్థాలకు దురాగతాలకు పాల్పడకుండా నైతిక విలువలు ఉండేలా చేసే బాధ్యత మన ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీ రాష్ట్ర అకడమిక్ కమిటీ మెంబర్ మహదేవప్ప, జిల్లా అదులపు ప్రధాన కార్యదర్శి ఎంపీ సుంకన్న, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్ గోపాల్, సీనియర్ నాయకులు వెంకోబ, సూర్యుడు, రవికుమార్, భాస్కర్, గణేష్, చిరంజీవి, అంజి, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలను అందరూ పాటించాలి

విశాలాంధ్ర - గోనెగండ్ల: దైవ ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం వారి బోధనలను అందరూ పాటించాలని సున్ని జామియా మస్జిదే మొహమ్మదియా ముల్లా ఉసేన్ సాహెబ్, కారుమంచి డాక్టర్ మాభాష, ముల్లా రహీం బాష, ముల్లా రహీమాన్, ముల్లా షేక్ సాహెబ్, ముల్లా షఫీ, విలేకరి మన్సూర్, ముల్లా షాషు,అల్లబండ ఖాశీం, ముల్లా అఫ్రోజ్, దరగల ఖాజా కోరారు. ఈద్ మీలాద్ పండుగ సందర్భంగా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగ మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈద్ మిలాద్ పండుగ సందర్భంగా మసీదులు ముస్లిం సోదరులకు నిండిపోయాయి. జామియా మసీదు నుండి చిత్రపటాలను పురవీధుల్లో ముస్లిం సోదరులు ఊరేగించి, నారే తక్బీర్, అల్లాహు అక్బర్ నినాదాలు ఇచ్చారు. జాతీయ జెండాను ఊరేగించి దేశభక్తి చాటారు ఈ సందర్భంగా ముల్లా అఫ్రోజ్ మాట్లాడుతూ దైవ ప్రవక్త జన్మదిన ఆచరించడం ఎంతో సంతోషంగా ఉందని, సర్వమానవాళికి ప్రవక్త శాంతి సందేశాన్ని ప్రసాదించారని ఉపన్యాసించారు. ముస్లిం సోదరులు అందరితో కలిసి మెలిసి జీవించాలని దేశ పురోభివృద్ధికి అందరూ కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఆయా మసీదుల్లో అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈద్ మిలాద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా సీఐ ఓహెచ్ భాస్కర్, పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా టీచర్స్ డే

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు భవిరిశెట్టి శ్రీకాంత్ సహకారంతో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యా రంగంలో విశిష్ట సేవలందించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎమ్.సి.సుబ్బారెడ్డి, లెక్చరర్ డాక్టర్ కె.సురేష్, బి. కోడూరు తెలుగు పండితులు రామ సుబ్బారెడ్డి, గురురాజా స్కూల్ గణిత అధ్యాపకులు తులసి నారాయణ మూర్తిలకు లయన్స్ క్లబ్ ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాలను శాలువా, పూల మాల, తలపాగా, జ్ఞాపికలతో ప్రదానం చేశారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత విశేషాలను, ఉపాధ్యాయ వృత్తి గొప్పతనాన్ని వివరించారు. లయన్ క్లబ్ రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, సభ్యులు యూసుఫ్, మేడం చంద్రశేఖర్, గురు రాజా పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్‌నభీ పండుగ వేడుకలు

విశాలాంధ్ర - బనగానపల్లె : ముస్లింలు తమ ఆరాధ్యదైవంగా భావించి ఆరాధించి, గౌరవించే ముహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం బనగానపల్లె పట్టణంలో ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 10గంటలకు నవాబు కూడలి వద్ద శ్రీ దస్తగిరి స్వామి దర్గా నుంచి ముస్లింల మతగురువు, దస్తగిరిస్వామి దర్గా (జండేవాలే సాహెబ్) పీఠాధిపతి సయ్యద్ అబ్దాల్ హుస్సేన్ సాహెబ్, సయ్యద్ అదిల్ హుస్సేన్ సాహెబ్ వారి కుటుంబసభ్యులు పెద్ద సంఖ్యలో ముస్లింలు వెంటరాగా దర్గా నుంచి ఊరేగింపుగా బయలుదేరి పాంచ్ కమాన్ మజీద్ చేరుకున్నారు. ఈ ఊరేగింపులో ముస్లింలు పెద్ద ఎత్తున భక్తిగీతాల మధ్య వాహనాలపై ముస్లింల పవిత్ర ప్రార్థనామందిరాలైన మక్కా మదీనా పోలిన నమూనాలు ప్రదర్శిస్తూ పెట్రోలు బంక్, ఆస్థానం, పాత పోలీస్ స్టేషన్, పాతబస్టాండ్ మీదుగా జుర్రేరు గట్టున ఉన్న పాంచ్ కమాన్ మజీద్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకున్నారు. ఊరేగింపులో చిన్న పిల్లలు, యువత ఉత్సాహంగా పాల్గొని ప్రవక్త జన్మదినాన్ని అత్యంత వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా పాంచ్ కమాన్ మజీద్ వద్ద ఏర్పాటుచేసిన వేదిక వద్ద పీఠాధిపతి సయ్యద్ అబ్దాల్ హుస్సేన్ సాహెబ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వాలను సోదరభావాన్ని బోధించారని గుర్తు చేశారు. వారి మార్గంలో పయనిస్తూ ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం ప్రార్థించాలని సూచించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి, ఎస్సై దుగ్గిరెడ్డి, కల్పన ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

మిలాద్ ఉన్‌నభీ సందర్భంగా ముస్లీంల ర్యాలీ

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లీం సోదరులు భారీగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక బందెషావలి దర్గా సమీపంలో ముస్లిం పెద్దలంతా కలసి మహ్మద్ ప్రవక్త జన్మించిన రోజు సందర్భంగా పట్టణంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అన్సర్ బాషా, మౌలాలి, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, సాగునీరు అందక అగమ్యగోచరంగా ఉంది

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రాష్ట్రంలో ఎరువుల కొరత, సాగు నీరు అందక రైతన్నల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని, వెంటనే రైతన్నల కష్టాలను గట్టెక్కించాలని, ఎరువుల కొరత లేకుండా ప్రతి రైతుకు సాగుకు సరిపడా యూరియాను అందించి తక్షణమే ఆదుకోవాలని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష, వైసీపి నేతలు, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ ఆమీర్ బాష, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్, దండె సుధాకర్, భాస్కర్ రెడ్డి, భక్తవత్సల రెడ్డి, ఎర్రన్న, రైతులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలపై సమావేశం నిర్వహించి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 9వ తేది రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలపై ఎరువుల కొరతపై అన్ని జిల్లా, మండల కేంద్రాలలో వైసీపీ నేతలు రైతులకు అండగా నిలిచి సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని జిల్లా కలెక్టర్లను వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ రైతేరాజు, జై కిసాన్, జై జవాన్ అంటూ రైతులను దేశ ప్రజలు గుర్తిస్తే నేడు కూటమి నేతలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ సకాలంలో ఎరువులను, సాగునీటిని అందించలేక రైతన్నలను నష్టాల్లోకి కష్టాలోకి నెడుతున్నారని విమర్శించారు. రైతులను పార్టీలకు అతీతంగా చూడాలని అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలయ్య ఏర్పాటుచేసిన గురుపూజోత్సవ కార్యక్రమానికి చిన్నటేకూరు ఐటిఐ కళాశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన రామ సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. అనంతరం రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించుకొని మీకు విద్య చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, విద్యతోపాటు ఆటల పోటీల్లో కూడా రాణించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శేషన్న ప్రతిభ అమోఘం

విశాలాంధ్ర - నందికొట్కూరు : జన సైనికుడు శేషన్న ప్రతిభ అమోఘమని నందికొట్కూరు జనసేన నియోజకవర్గ నాయకులు శ్రీరామ థియేటర్ ఓనర్ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం నియోజవర్గ పరిధిలోని పగిడాల గ్రామంలో వగడం శేషన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పవన్ కళ్యాణ్‌పై పాట రాశారు. ఈ సందర్భంగా నందికొట్కూరు జనసేన సమన్వయ కర్త రామిరెడ్డి పాటను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేషన్న పవన్ కళ్యాణ్‌పై అభిమానంతో పాటరాయడం హర్షించదగ్గ విషయమన్నారు. శేషన్నను గేయ రచయితగా చిత్ర పరిశ్రమకు పరిచయం చేస్తానని హామీ ఇచ్చారు. శేషన్న మాట్లాడుతూ గేయ రచయిత తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు బాలరాజు, కర్నాటి మల్లికార్జున, రాజు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలోని మూడురాళ్ల పల్లె గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు వేద పండితుల అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా జరిగింది. ఉభయదారులు కామిశెట్టి ప్రసాద్, ప్రమీల దంపతులచే శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి కల్యాణం చేశారు. తాళి బొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులచే పల్లకి ఉత్సవం చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పులి ఓబులరెడ్డి, సుదర్శన్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, చంద్ర ఓబులరెడ్డి, కామిశెట్టి నరసింహులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అందుబాటులోకి యూరియా

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: యూరియా అందుబాటులో ఉన్నదని రైతులు ఆందోళన చెందవద్దని ఇంచార్జి మండల వ్యవసాయ అధికారి నాగేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ఆర్ఎస్కే నందు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ఆయా ఆర్ఎస్కేలలో యూరియాను రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే బెలుం ఆర్ఎస్కే పరిధిలో రైతులకు11.98 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామన్నారు. ఆరో తేదీలోగా పెట్నికోట 11.97 ఎం టి, నందిపాడు 23.94, బి ఉప్పులూరు 23.94, తొళ్ళమడుగు 23.94 మెట్రిక్ టన్నులు ఆర్ఎస్కేలకు సరఫరా అవుతుందని, అదే రోజుతో పాటు ఏడో తేదీన పంపిణీ చేపడతామని తెలిపారు. వారం రోజుల్లో పెద్దవెంత్రుల, కొలిమిగుండ్ల, చింతలాయిపల్లి ఆర్ఎస్కే లకు యూరియా సరఫరా చేస్తామన్నారు. ఈక్రాప్ ఆధారంగా పంట వేసిన రైతులకు మాత్రమే యూరియాను మండల టీం అధికారులు పంపిణీ చేస్తారన్నారు. రైతులు యూరియా గురించి ఆందోళన చెందవద్దని అవసరమైన మేరకు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు.

ప్రవక్త జన్మదిన సందర్భంగా భారీ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలో మిలాద్ ఉన్ నబీ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లింలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో భారీ ర్యాలీ చేపట్టారు. మంజుపీర్ దర్గా పీఠాధిపతి కరిముల్లా సాహెబ్, అసదుల్లా సాహెబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని ఎన్‌కె రోడ్డు మీదుగా కల్పనా సెంటర్, బైరమల్ వీధి, గాంధీచౌక్, శ్రీనివాస్ సెంటర్ మీదుగా ర్యాలీ చేపట్టారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, 11వ వార్డు తెదేపా ఇంచార్జ్ అఫ్జల్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్న తుంబలం, కల్లుకుంట, మేకడోన, కంబలదిన్నె, జాలవాడి, బసలదొడ్డి, హెచ్.మురవణి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలో పెద్ద మసీదు, చిన్న మసీదు వస్తాదులు రెహమాన్, ఫరీద్ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గ్రామ పురవీదుల గుండా మక్కా మసీదు నమూనాలతో ర్యాలీ నిర్వహించారు. నారే తక్బీర్, అల్లాహు అక్బర్ నినాదాలు చేస్తూ జాతీయ జెండాను ఊరేగించి దేశభక్తి చాటారు. సర్వమానవాళికి ప్రవక్త శాంతి సందేశాన్ని ప్రసాదించారని సందేశమిచ్చారు. ముస్లీం సోదరులు అందరితో కలిసి జీవించాలని కోరారు.

సద్భావన బైక్ ర్యాలీని ప్రారంభించిన ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజానికి మార్గదర్శి, అంతిమ దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సోల్లెలాహు అలైహి వసల్లం 1500వ జయంతి సందర్భంగా నంద్యాల ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలను ప్రారంభించడానికి ముఖ్య అతిధిగా హాజరైన తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ కి నంద్యాల ముస్లిం యువత ఘనంగా స్వాగతం పలికారు. ఫిరోజ్ ర్యాలీని ప్రారంభించి నంద్యాల యువకులతో కలిసి స్వయంగా తానే బైక్ నడిపారు. అనంతరం ఆయన నంద్యాల ముస్లిం సోదరులందరికీ మీలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ప్రవక్త ముహమ్మద్ సోల్లెలాహు అలైహి వసల్లం గారి విశిష్టతను గుర్తుచేసుకుని, వారు చూపిన సన్మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం యూత్ సభ్యులు నంద్యాల ముస్లిమ్ యువత వసీం, జోహారుద్దీన్, షేక్ సమీర్, ఫజిల్, అహ్మద్ పాల్గొన్నారు.